## నేడు వాహనాల వేలం

చందానగర్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శేరిలింగంపల్లి మండలం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రియ ఆదేశాల మేరకు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మొత్తం 19 వాహనాలు ఉన్నాయని అందులో రెండు కార్లు, ఒక ఆటో1, ద్విచక్రవాహనాలు 16 ఉన్నాయని తెలిపారు.

## శేరిలింగంపల్లి ఓటర్లు 7.65 లక్షల మంది

శేరిలింగంపల్లి: తుది ఓటరు జాబితా సోమవారం విడుదల అయ్యింది. ఇందులో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 7,65,921 ఓటర్లు ఉన్నారు. వీరిలో 4,04,111 మంది పురుషులు, 3,61,666 మహిళా ఓటర్లు, 144 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా శేరిలింగంపల్లి నిలిచింది.

## సంస్కృతి విద్యార్థుల ప్రతిభ



గచ్చిబౌలి: విశ్వ ఎడ్యుటెక్ నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ వేదిక మ్యాథ్స్ పరీక్షల్లో సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం జరిగిన పోటీల్లో సీనియర్ లెవల్ విభాగంలో సుషిత్‌గౌడ జిల్లా స్థాయిలో మొదటి స్థానం, రిజిత ద్వితీయ స్థానం, అబాకస్ జూనియర్ లెవల్‌లో ఫలజ్‌ఖాన్ మొదటిస్థానం, సీనియర్ లెవల్ వేదిక్ మ్యాథ్స్‌లో కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థి మనస్విని ద్వితీయ ర్యాంకు సాధించింది. రైస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఇటీవల నిర్వహించిన తిరంగా ఇంటర్ స్కూల్ పోటీల్లో కూడా స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 19 ఇంటర్నేషనల్ సీబీఎస్ఈ స్కూల్స్ పోటీల్లో గిగిల్‌గాలలో మనస్విని మొదటిస్థానం, స్ఫూర్తి మూడోస్థానం, వెంచర్ అండ్ అడ్వెంచర్‌లో భవ్య టీమ్ మొదటిస్థానం, హేమ టీమ్ మూడో స్థానంలో నిలిచింది. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిని విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను పాఠశాల చైర్మన్ మంగ శారపు లక్ష్మణ్ సోమవారం అభినందించారు.

## ఆకట్టుకుంటున్న శారీ మేళా



చీరను పరిశీలిస్తున్న టూరిజం, కల్చరల్ సెక్రటరీ స్మితా సబర్వాల్

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన మృగనయిని మహేశ్వరీ, చందేరీ ఫెస్టివల్ ఆకట్టుకుంటున్నది. టూరిజం, కల్చరల్ సెక్రటరీ స్మితా సబర్వాల్, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కే లక్ష్మి ఆదివారం రాత్రి సందర్శించారు. కళాకారుల ఉత్పత్తులను కొనుగోలు చేశారు. బ్లాక్‌ప్రింట్, బెడ్‌కవర్స్, చందేరీ, మహేశ్వరీ, కొససిల్క్, కెమికల్ ప్రింట్ తదితర చీరలు ఆకర్షణీయంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈనెల 14 వరకు ప్రదర్శన కొనసాగుతుందని ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. చీరల కొనుగోలుపై 20 శాతం రాయితీ అందజేస్తున్నట్లు తెలిపారు.

## నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ దగ్గర గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైనా విషయం తెలిసిందే. అయితే మృతుడి వివరాలు తెలియకపోవడం, సమీపంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. మియాపూర్ పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి హంతకుల ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు. శనివారం రాత్రి సమయంలో కొంతమంది వ్యక్తులు రైల్వేస్టేషన్ సమీపంలో గొడవపడినట్లు సమాచారం. పోలీసులు చుట్టుపక్కల సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డబ్బుల కోసం హత్యచేసి అతడి వద్ద ఉన్న వస్తువులను దొంగిలించుకుని వెళ్లారా..? లేదా గొడవపడి హత్య చేశారా... మరే ఇతరాత్ర కారణాలు ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## దైవభక్తితో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు: మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని పోచారం గ్రామంలో సోమవారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని మాట్లాడారు.

# కంచె కరువాయే!

### మార్తాండనగర్, ప్రేమ్‌నగర్‌లో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



- పట్టని సంబంధిత శాఖ అధికారులు
- రక్షణ ఏర్పాట్లు చేయాలని బస్తీవాసుల వినతి

చందానగర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్, ప్రేమ్‌నగర్‌లోని బస్తీల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. పెరుగుతున్న భవనాలకు అనుగుణంగా మౌలిక వసతుల్లో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రతి వీధిలో ఒకటి, లేదా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. అయితే ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లలో ట్రాన్స్‌ఫార్మర్లు పెడుతున్నా.. అధికారులు వాటి చుట్టూ కంచెలను మాత్రం ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు భయందోళనకు గురవుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు వాటి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు



ప్రేమ్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితి

కోరుతున్నారు.

- మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ ప్రధాన రోడ్లలోని కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుకు ఆనుకొని ఉన్నాయి. వెంటనే దిమ్మె ఎత్తు పెంచి, కంచెలను కూడా ఏర్పాటు చేయాలి
- రోడ్డు మధ్యలో కాకుండా ఖాళీ ప్రదేశాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాలి.
- స్తంభాలకు వేలాడుతున్న తీగలను తొలగించాలి
- ఇండ్లకు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలను తొలగించి కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలి
- లో ఓల్టేజీ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో పరిష్కరించాలి.

### ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెల ఎత్తు పెంచాలి..



మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల్లోని అంతర్గత రోడ్లపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి దిమ్మెల ఎత్తు పెంచితే కొంత మేర సమస్య పరిష్కారం అవుతుంది. దాంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు కూడా ఏర్పాటు చేయాలి. – వీరబ్రహ్మం, మార్తాండనగర్ వాసి

### ఉన్నతాధికారులు దృష్టి సారించాలి..



ప్రేమ్‌నగర్ బస్తీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకుండా పోయింది. దీంతో అటు వైపు వెళ్లాలంటేనే భయంగా ఉంటుంది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి తగ చర్యలు తీసుకోవాలి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే కంచెను ఏర్పాటు చేయాలి.
– జంగయ్య గౌడ్, ప్రేమ్‌నగర్ వాసి



మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల్లోని ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



మసీదుబండలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు, మహిళా ప్రతినిధులు


గచ్చిబౌలి/రాయదుర్గం: శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ జన్మదిన వేడుకలను మసీదుబండలోని ఆయన నివాసంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడితోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు హాజరై ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

**కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు..**
గోపన్‌పల్లిలోని కార్యాలయంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ, దాని అనుబంధ సంఘాల నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరై ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పటాకులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పని చేసి గచ్చిబౌలిని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు పాల్గొన్నారు.



గోపన్‌పల్లిలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డికి సన్మానం..

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చందానగర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

- శాంతినగర్ ఫీడర్ పరిధిలో శాంతినగర్, ఉషోదయ అపార్ట్‌మెంట్ రోడ్డు, ధర్మపురి టెంపుల్ రోడ్డు, దీప్తిశ్రీనగర్ రోడ్డు నంబర్ 14 నుంచి 25 వరకు, ఆదర్శనగర్ ఏరియాలు.
- సీబీఆర్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలో సీబీఆర్ ఎస్టేట్స్, క్రోమ భవనం వెనకాల వైపు, శ్రీ దుర్గా హోమ్స్, ఆంధ్రా బ్యాంక్ ఏరియా.

**చందానగర్ సెక్షన్‌లో..**

- మదీనాగూడ సబ్‌స్టేషన్ హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలో మైత్రీనగర్, ఆల్విన్ కాలనీ, కల్కి అపార్ట్‌మెంట్స్, మదీనాగూడ విలేజ్ కొంత భాగం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ దీప్తి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**మయూరినగర్ సబ్ స్టేషన్ పరిధిలో..**
మియాపూర్: మయూరినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఏఈ రవిచంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరియానగర్, ఎస్‌బీఐ రూట్, మయూరినగర్ పార్క్, ఏఆర్‌కే టవర్స్, కోకనట్ ట్రీ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు. అలాగే మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 నుంచి 3 గంటల వరకు మదీనాగూడ, కృషినగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, ప్రశాంత్‌నగర్, జేపీఎన్‌నగర్, నాగార్జున ఎన్‌క్లేవ్, హెచ్ఎంటీ స్వర్ణపురి, జనప్రియ వెస్ట్‌సిటీ, వీడీఐ కాలనీ, మియాపూర్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

**నల్లగండ్ల సబ్ స్టేషన్ పరిధిలో..**
శేరిలింగంపల్లి: నల్లగండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుల్‌మోహర్ పార్కుకాలనీ, నేతాజీనగర్, అలిండ్ కంపెనీ ప్రాంతం.

- బాపూనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గోపీనగర్, బాపూనగర్ ప్రాంతాలు.
- 33/11 కేవీ నల్లగండ్ల ఎస్ఎస్,11 కేవీ లేక్‌వ్యూ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు నల్లగండ్ల హుడాకాలనీ, రత్నదీప్, విజేత సూపర్‌మార్కెట్, ప్రధాన రోడ్డు, నల్లగండ్ల విలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ప్రజావాణికి 14 ఫిర్యాదులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డి అధ్యక్షతన సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. మొత్తం 11 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి 7, ఇంజినీరింగ్ 2, శానిటేషన్, ఎంటమాలజీ విభాగాలకు ఒక్కొక్క చొప్పున దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు. ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీ ప్రేమ్ కుమార్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో..**
చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూకు సంబంధించి రెండు, శానిటేషన్ విభాగానికి సంబంధించి మరొక అర్జీ వచ్చిందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.



శేరిలింగంపల్లి సర్కిల్ ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డి, అధికారులు



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ..

## ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చందానగర్: జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవం 2025 పురస్కరించుకుని లింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు సోమవారం సడన్ సురక్ష అభియాన్, జాగ్రత్తలపై రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు, చందానగర్ పోలీసులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆటోను నిలపవద్దన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని సూచించారు. కార్యక్రమంలో చందానగర్ ఎస్‌హెచ్ఓ పాలవెల్లి, ఎస్ఐలు నాగేశ్వరరావు, కొండాపూర్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వీ నవీన్, మనోజ్, ఏఎంవీఐ, ఇతర సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నాలాల విస్తరణ ఆర్‌సీసీ బాక్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. కొండాపూర్ డివిజన్‌లోని గఫూర్‌నగర్ కాలనీ నుంచి దుర్గంచెరువు వరకు, సైబర్ హిల్స్ నుంచి వయా జనార్దన్ హిల్స్ యూరోకిడ్స్ స్కూల్ వరకు రూ.25.41 కోట్లతో చేపట్టే పనులపై ఎస్ఎన్‌డీపీ విభాగం ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో వరద సమస్య పునరావృత్తం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుని నాలా విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. వచ్చే వర్షాకాలం లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ వశీధర్, ఏఈ వెంకటేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎస్ఎన్‌డీపీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

## కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

మియాపూర్: కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఏఎస్ రాజునగర్, కేకే ఎన్‌క్లేవ్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని, పలు పనులు చేపట్టాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాంధీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానన్నారు. కలిసిన వారిలో సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, వర్మ, ప్రసన్న, నాగరాజు, శివ, విశ్వనాథ్‌రాజు, బలరాం, రవి, ప్రసాద్‌రాజు, శ్రీధర్, సోమనాథ్ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లలో అవకాశం కల్పించాలి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల బృందం

రాయదుర్గం: ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని తెలంగాణ దివ్యాంగుల సమాఖ్య, శేరిలింగంపల్లి సమాఖ్య నాయకులు కోరారు. ఈ మేరకు సమాఖ్య ప్రతినిధులు మేకల అశోక్‌కుమార్‌ముదిరాజ్, ఫకీర్, లింగమ్మ, శ్రీనివాసులు, నాగమణి, భాగ్య, రవీందర్‌రెడ్డి, వెంకటేష్, రషీద్, ఆరీఫ్ బృందం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం ప్రభుత్వ ఇళ్లలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని కోరామన్నారు.

## ఉత్తమ లయన్ జోన్ చైర్మన్‌గా విజయ్‌కుమార్




అవార్డు అందుకుంటున్న కొండా విజయ్‌కుమార్

చందానగర్: లయన్స్ క్లబ్ ఉత్తమ జోన్ చైర్మన్‌గా చందానగర్‌కు చెందిన కొండా విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. జోనల్ చైర్మన్‌గా 6 నెలల క్రితం బాధ్యతలు స్వీకరించి తన జోన్ పరిధిలోని క్లబ్‌లతో పాటు క్లబ్ సభ్యులతో కలిసి పలు సేవా కార్యక్రమాలు, లయన్స్ సేవలను మరింత విస్తృతం చేయడంలో చేసిన కృషికి అవార్డు అందజేసినట్లు లయన్స్ రీజియన్ చైర్మన్ కరుణాకర్ గౌడ్ తెలిపారు. లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు చేతులు మీదుగా సోమవారం ఆయన అవార్డు అందుకున్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అనుచరుల అరెస్ట్

గచ్చిబౌలి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచరులను గచ్చిబౌలి పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం అరెస్ట్ చేశారు. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరికాలనీలోని సిల్వర్ కి ఓయో హోటల్, ట్రీ హోటల్‌లో హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అనుచరులు బసచేసినట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దాదాపు 35 మందిని అరెస్ట్ చేశారు. సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచి వివరాలు సేకరించి వదిలిపెట్టారు.

## గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా



ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్

చందానగర్: శేరిలింగంపల్లి మండలంలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా పెట్టామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆదేశాల మేరకు నానక్‌రాంగూడలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి 24 గంటల పాటు నిఘా ఏర్పాటు చేశామన్నారు. యువత, ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి తదితర మత్తు పదార్థాల సరఫరా చేసినా.. విక్రయించినా కేసుతో పాటు పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే పలు ప్రాంతాల్లో గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

**2024 లో ..172 కేసుల నమోదు**
శేరిలింగంపల్లి మండలం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో 2024 సంవత్సరంలో 172 కేసులు నమోదు చేశామని తెలిపారు. గంజాయికి సంబంధించి 64 కేసులు నమోదు చేసి 105 మంది నిందితులను అరెస్ట్ చేసి 41 వాహనాలు సీజ్ చేశామన్నారు. 111.822 కిలోల గంజాయి, 5.1 కిలోల గంజాయి చాక్లెట్లు, 3 గంజాయి మొక్కలు, 300 గ్రాముల ఓపీఎం, 151 గ్రాముల హెరాయిన్, 20.46 గ్రాముల ఎండీఎంఏ, 1.04 కిలోల ఓజీ కుష్, 1.379 కిలోల హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## విద్యారంగంలో శరవేగంగా మార్పు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు

రాయదుర్గం: దేశంలోని విద్యారంగంలో శరవేగంగా మార్పులు వస్తున్నాయని యూజీసీ ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ–మాలవ్య మిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో స్టాటిస్టికల్ ప్యాకేజీ ఫర్ సోషల్ సైన్సెస్ (ఎస్‌పీఎస్ఎస్)పై 3 రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాంఘిక శాస్త్రంలో పరిశోధనలు చేసేందుకు సాఫ్ట్‌వేర్ ముఖ్యమైన సాధనమన్నారు. దేశవ్యాప్తంగా 45 మందికి పైగా పాల్గొంటున్నారని వారందరు ఎస్‌పీఎస్ఎస్ ఇంటర్‌ఫేస్, డేటా మేనేజ్‌మెంట్‌ను అర్థం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కోఆర్డినేటర్ డాక్టర్ మెరాజ్ అహ్మద్ ముబార్కి మాట్లాడుతూ.. వర్క్‌షాప్‌లో 6 మ్యాడ్యూల్స్ ఉంటాయని, గణాంకాలు, సామాజిక పని, వ్యాపార నిర్వహణ రంగానికి చెందిన నిపుణులు పాల్గొంటున్నారని వివరించారు. మూడు రోజులపాటు సాగే వర్క్‌షాప్‌లో ఎస్‌పీఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ ఫండమెంటల్స్, డిస్క్రిప్టివ్ స్టాటిస్టిక్స్, అడ్వాన్స్‌డ్ స్టాటిస్టికల్ టెక్నిక్స్, డేటా విజువలైజేషన్, రిపోర్టింగ్ రీసెర్చ్ స్పెసిఫిక్ అప్లికేషన్లకు సంబంధించిన థీమ్‌లు ఉంటాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.